క్లుప్తంగా

వరి పైరు దగ్ధం



కలిగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపాళెం గ్రామానికి చెందిన సుతారు మాల్యాద్రి వరిపైరు గురువారం దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు 11 కేవీ విద్యుత్ తీగ తెగిపడడంతో మంటలు వ్యాపించి కోతదశలో ఉన్న సుమారు 0.30 సెంట్లలోని వరిపంట దగ్ధమైంది. సుమారు రూ.40 వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం



సంగం: క్షయ వ్యాధిగ్రస్తులకు స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో గురువారం పౌష్టికాహారం అందజేశారు. బుచ్చిరెడ్డిపాళెం టీబీ యూనిట్ పరిధిలోని సంగం ప్రభుత్వ వైద్యశాలలో 20 మంది రోగులకు పవర్‌గ్రిడ్ కంపెనీ సంస్థ అందజేసిన పౌష్టికాహారాన్ని వైద్యబృందం అందించింది. కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, హెల్త్ సూపర్‌వైజర్ జలీల్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని వీడే ప్రసక్తే లేదు

దుత్తలూరు: తాను వైఎస్సార్‌సీపీని వీడే ప్రసక్తే లేదని మండలంలోని బండకిందపల్లి సర్పంచ్ అంకినపల్లి రమేష్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయ న విలేకరులతో మాట్లాడుతూ తాను అందుబాటులో లేకపోయినప్పటికీ బుధవారం వింజమూరులోని కాకర్ల సురేష్ కార్యాలయానికి వెళ్లి టీడీపీలో చేరినట్లు ఓ పత్రికలో వార్త ప్రచురించారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నానని, నిజానిజాలు తెలుసుకోకుండా వార్తలు రాయడం సరికాదని తెలిపారు. టీడీపీ నాయకులు ఇలాంటి దుష్ప్రచారాలు చేయడం మానుకోవాలన్నారు.

కరోనా సేవలకు గుర్తింపుగా డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న చిరంజీవి

ఆత్మకూరు: మర్రిపాడు మండలానికి చెందిన నల్లబోతుల చిరంజీవి కరోనా విపత్తు సమయంలో ప్రజలకు చేసిన సేవలను గుర్తించిన ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆయన గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. చిరంజీవి కరోనా సమయంలో అనేక గ్రామాల్లో ఇంటింటికీ నిత్యావసర సరుకులు, మందులు, కూరగాయలు అందజేశారు. అంతేకాకుండా ఆయన అనేక సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఈయన సేవలను హైదరాబాదులోని ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ గుర్తించి బుధవారం హైదరాబాదులోని సిటీ కల్చర్ ఆడిటోరియంలో గౌరవ డాక్టరేట్ అందజేసినట్లు చిరంజీవి గురువారం తెలిపారు. చిరంజీవి వైఎస్సార్‌సీపీలో క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తున్నారు.

వధూవరులకు ఎమ్మెల్యే ఆశీస్సులు



ఆత్మకూరురూరల్: మండలంలోని వెన్నవాడలో గురువారం జరిగిన చల్లగుండ్ల ప్రవీణ్, ముని బిందు వివాహ వేడుకలకు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు రేవూరు విజయ నరసింహారెడ్డి, నూతన గృహ వేడుకల్లో పాల్గొన్నారు. ఆయన వెంట ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు దిశించర్ల ప్రసాద్, పర్వత రెడ్డి బలరామిరెడ్డి, రేవూరు పెంచలరెడ్డి, దిశించర్ల రాజా, జగన్నాథం ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశం

ఆత్మకూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన పొత్తు పెట్టుకున్న నేపథ్యంలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పట్టణంలోని రవితేజ కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి ఆంజనేయరెడ్డి, సురేష్‌రెడ్డి, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మభ్యపెట్టి టీడీపీ కండువా కప్పడం దుర్మార్గం



బీద మస్తాన్‌రావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ఉప సర్పంచ్ నాగమ్మ

• రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు

అల్లూరు: మభ్యపెట్టి టీడీపీ కండువాలు కప్పడం ఆ పార్టీ నేతలకే చెల్లుతుందని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి చెందిన గంగపట్నం నాగమ్మను ఇటీవల టీడీపీకి చెందిన వారు పనిమీద తీసుకెళ్లి మభ్యపెట్టి టీడీపీ కండువా కప్పారని, ఇలాంటి నీచ రాజకీయం చేయడం టీడీపీ నేతలకు అలవాటేనని అన్నారు. నాగమ్మ తన వద్దకు వచ్చి తనకు ముఖ్యమంత్రి జగనన్న ఉప సర్పంచ్ పదవి ఇచ్చారని, టీడీపీ నేతలు తనను మభ్యపెట్టి పార్టీ కండువా కప్పారని వాపోయి తిరిగి తన సమక్షంలో వైఎస్సార్‌సీపీ పార్టీ కండువా కప్పుకున్నారని తెలిపారు. ఇలాంటి రాజకీయాలను టీడీపీ మానుకోవాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపిస్తాయని తెలిపారు. కావలి ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వి.వి జయసాయిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. శనివారం కావలిలో జరిగే మేమంతా సిద్ధం సభకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, బీద రమేష్, సర్పంచ్ దాసరి మల్లి, దాసరి శ్రీహరి, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించండి

• ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు



చేజర్ల: పాడేరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

చేజర్ల: పేదల అభ్యున్నతే ధ్యేయంగా సంక్షేమ పాలన అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. గురువారం చేజర్ల మండలంలోని పాడేరు, వావిలేరు, ఎన్వీ కండ్రిక గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి ఎర్రగుంట పెంచలయ్య, నాయకులు వంశీ, రాజయ్య, వెంకటేశ్వర్లు, నరసయ్య, వసంత, పెంచలకొండయ్య, నరసింహులు, పెంచలమ్మ, ఆదిలక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఆదరించండి.. అభివృద్ధి చేస్తాం

అనుమసముద్రంపేట: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని, తద్వారా గ్రామాలను అభివృద్ధి చేస్తామని ఆ పార్టీ నాయకులు తెలిపారు. గురువారం ఏఎస్‌పేట మండలంలోని గుంపర్లపాడులో నాయకులు ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీఎస్ కన్వీనర్ పులిమి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చామని తెలిపారు. గుంపర్లపాడు గ్రామాభివృద్ధికి కృషి చేశామని, ప్రతి వీధిలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, రాజవోలు సొసైటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ రంగారెడ్డి, నాయకులు సిరిగిరి వెంకటేశ్వర్లురెడ్డి, కోఆప్షన్ మాజీ సభ్యుడు రియాజ్ అహ్మద్, వెంకట రమణయ్య, బాలకృష్ణారెడ్డి, సిరిగిరి కొండారెడ్డి, కోటిరెడ్డి, షౌకాత్‌అలీ, తిరుమలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

సీతారామపురం(ఉదయగిరి): సీతారామపురం పంచాయతీ పండ్రంగి, నారాయణమ్మపేట గ్రామాల్లో గురువారం వైఎస్సార్‌సీపీ నేతలు ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని, ఉదయగిరి ఎమ్మెల్యేగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. అనంతరం ఓగూరుపల్లిలో వైఎస్సార్‌సీపీ నేత అల్లూరిరెడ్డి కుమారుడు చిన్నపరెడ్డి వివాహ వేడుకలో నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దుగ్గిరెడ్డి గురువారెడ్డి, అల్లూరురాజు, పాముల రమణయ్య, సర్పంచ్‌లు మునగాల రామచంద్రారెడ్డి, సుధాకర్ నాయుడు, దయాకర్‌రెడ్డి, బేరి భాస్కర్‌రెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా..

మర్రిపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ మర్రిపాడు మండల నాయకులు గురువారం మండలంలోని రామానాయుడుపల్లి, నందవరం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డిని, ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, మండల ఎన్నికల పరిశీలకుడు సందీప్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సిద్దంరెడ్డి మోహన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ సోమల మాధవరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, బొర్రా వెంకటేశ్వర్లురెడ్డి, హజరత్‌రెడ్డి, చంద్రా నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



అనుమసముద్రంపేట: గుంపర్లపాడులో వైఎస్సార్‌సీపీ నేతల ఎన్నికల ప్రచారం



మర్రిపాడు: కరపత్రాలు అందజేసిన నాయకులు

కుంభాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



స్వామివారి కల్యాణ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: పట్టణంలోని పద్మావతి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కుంభాభిషేక మహోత్సవ పూజలు గత నాలుగు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. జెడ్పీ మాజీ చైర్మన్, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పూజల్లో భాగంగా గురువారం ఆలయ శిఖరం, ధ్వజస్తంభం, మూలవిరాట్‌లకు విశేష కలశ జలాలతో తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులు కుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వేదికపై పద్మావతి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పూజల్లో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

పూటకో పార్టీ మారితే ప్రజల కష్టాలెలా తెలుస్తాయి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మర్రిపాడు: టీడీపీ ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి పూటకో పార్టీ మారితే ప్రజల కష్టాలు ఎలా తెలుస్తాయని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించారు. మర్రిపాడులోని జేసీఎస్ కార్యాలయంలో గురువారం వైఎస్సార్‌సీపీ మండల నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, సిద్దంరెడ్డి మోహన్‌రెడ్డి, సోమల మాధవరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, బొర్రా వెంకటేశ్వర్లురెడ్డి, హజరత్‌రెడ్డి, చంద్రా నారాయణస్వామి మాట్లాడుతూ ఆనం రామనారాయణరెడ్డి ప్రచార ఆర్భాటం కోసమే టీడీపీ నాయకులకే మళ్లీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్నారని తెలిపారు. ఆనం రామనారాయణరెడ్డి స్థానికంగా అందుబాటులో ఉండరని, ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విక్రమ్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మర్రిపాడు మండల ఎన్నికల పరిశీలకుడు సందీప్‌రెడ్డి, గంగినేని బాబు, దుద్దుగుంట జయరామిరెడ్డి, కాశిరెడ్డి, కొండారెడ్డి, గువ్వల వెంగళరెడ్డి, బొర్రా ఓబులరెడ్డి, కొండ్రెడ్డి రమణారెడ్డి, అన్నవరపు కృష్ణారెడ్డి, షేక్ మౌలాలి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

ఆత్మకూరురూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ జారీ చేసిన సమాచారం మేరకు ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలలపాటు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలని ఆత్మకూరు తహసీల్దార్ ఎస్.శివనాగిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 3 గంటల మధ్య ఎండలో తిరగడం మంచిదికాదని, అత్యవసరమైతేనే ఇంటి నుంచి బయటికి రావాలని తెలిపారు. ఎండ ప్రభావం నుంచి రక్షణ పొందేందుకు మంచినీరు, మజ్జిగ, కొబ్బరినీళ్లు తాగడంతోపాటు కాటన్ దుస్తులు ధరించాలని తెలిపారు. అలాగే గ్రామాల్లోని ఆరోగ్య కేంద్ర సహాయకులు, కార్యకర్తల సూచనల ప్రకారం తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

పోలేరమ్మకు పూజలు



అల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరేందుకు గురువారం కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి అల్లూరు నుంచి బయలుదేరిన క్రమంలో ఆయన స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని వినాయకుడి ఆలయంలో, పోలేరమ్మ చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట పలువురు అనుచరులు, అభిమానులు ఉన్నారు.

తెల్లరాయి అక్రమ రవాణా

చేజర్ల: మండలంలోని పలు గ్రామాల్లో తెల్లరాయి అక్రమ రవాణా జరుగుతోందని, అధికారులు అడ్డుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. మండలంలోని తూర్పుఖమ్మంపాడు, మడపల్లి, యనమదల గ్రామాల్లో రాత్రి వేళల్లో తెల్లరాయి అక్రమ రవాణా జరుగుతోందని తెలిపారు. దీనిపై అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ విషయమై తహసీల్దార్ గోపీకృష్ణను గురువారం వివరణ కోరగా తమ సిబ్బందిని ఆయా గ్రామాలకు పంపి విచారిస్తున్నామని, తెల్లరాయి అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

93 శాతం పింఛన్ల పంపిణీ

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట మండల పరిధిలో గురువారం నాటికి 93.5 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. సచివాలయ సిబ్బంది ఉదయం 7 గంటల నుంచి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. మండల పరిధిలో మొత్తం 5,083 మంది లబ్ధిదారులు ఉండగా.. 4,755 మందికి పింఛన్ నగదు పంపిణీ చేసినట్లు తెలిపారు.

వలంటీర్ల రాజీనామా

ఆత్మకూరురూరల్: మండలంలోని అప్పారావుపాళెం సచివాలయంలో వలంటీర్లుగా పనిచేస్తున్న వెంకటేష్, మురళి, బ్రహ్మయ్య తదితరులు గురువారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ బాలాజీనాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో అప్పారావుపాళెం వైఎస్సార్‌సీపీ నాయకుడు చంద్రా హజరత్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం



వింజమూరులో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులో జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోని ఓ భవనంలో గురువారం వైఎస్సార్‌సీపీ ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయ్యే వరకు పార్టీ కార్యకలాపాల కోసం ఈ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా శనివారం కావలిలో జరిగే సీఎం సభకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సీఎం సభలకు ప్రజల నుంచి అపూర్వ స్పందన ఉందని, అన్నివర్గాల ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు గణపం బాలకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఆనంగి రమణయ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రేవునూరు శ్రీనివాసరెడ్డి, స్టేట్ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కర్నాటి ప్రభాకర్‌రెడ్డి, నేతలు గణపం రమేష్, ఎం.విజయరెడ్డి, పి.వెంకటేశ్వర్లు, ఎ.రాజేష్, భోజనపు గోపి, గోపిరెడ్డి రమణారెడ్డి, ఎం.గోవిందరెడ్డి, జూపల్లి రాజా, సూరం వినోద్, పల్లాల ప్రసాద్, తాటిచెట్ల కాలేషా, బండి కృష్ణారెడ్డి, దాదిబత్తిన అంకిరెడ్డి తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



ఉదయగిరి: వైఎస్సార్‌సీపీలో చేరిన యువకులు



కావలి: ఎమ్మెల్యే సతీమణి సమక్షంలో..



చేజర్ల: ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి సమక్షంలో..

ఉదయగిరి: పట్టణంలోని యాదవపాళేనికి చెందిన కొందరు టీడీపీ యువకులు గురువారం బ్రాహ్మణపల్లిలో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య, ఉద్యోగ అవకాశాలు పెరగాలన్నా, యువతకు అన్నిరంగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలన్నా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. యువకులందరూ వైఎస్సార్‌సీపీ తరఫున ప్రచారం చేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని వీడి..

కావలి: కావలిరూరల్ మండలం చలంచర్లలో టీడీపీకి చెందిన 30 కుటుంబాలు గురువారం ఆ పార్టీకి గుడ్ బై చెప్పి వైఎస్సార్‌సీపీలో చేరారు. కావలిలోని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసానికి చేరుకున్న చలంచర్ల టీడీపీ కార్యకర్తలు పేముల కోటయ్య, జయరాజ్, మారుపూడి శ్రీహరి, బండ్లమూడి మధుబాబు, మల్లికార్జున, మైనంపాటి అంకయ్య, మొగిలిగుండ్ల మాల్యాద్రి, దానం సూరిబాబు తదితరులు ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆమె వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాలమహానాడు అధ్యక్షుడు దాసరి శివాజీ మాట్లాడుతూ చంద్రబాబు పింఛన్లను ఆపించి మొసలి కన్నీరు కారుస్తున్నాడని దుయ్యబట్టారు. పెత్తందారీ పోకడలతో చంద్రబాబునాయుడు పేదల పొట్ట కొడుతున్నాడని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్‌యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు జంపాని రాఘవులుగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

చేజర్లలో..

చేజర్ల: మండలంలోని తూర్పుకంభంపాడు అరుంధతీయవాడకు చెందిన 20 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. గురువారం చేజర్లలోని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి నివాసంలో వారు పార్టీలో చేరారు. ఎంపీపీ వారందరికీ వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కాకుమూరు వెంకటరెడ్డి, పెంచలనర్సయ్య, రమేష్, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, సాయి, పామర్తి రామయ్య పాల్గొన్నారు.

కావ్య మెప్పు కోసమే అబద్ధాలు



కావలి: టీడీపీ కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి మెప్పు కోసమే కొంతమంది ముస్లిం నాయకులుగా చలామణి అవుతున్న వ్యక్తులు వైఎస్సార్‌సీపీపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆ పార్టీ ముస్లిం నాయకులు షేక్ షాహుల్ హమీద్, షేక్ నాయబ్‌రసూల్, షేక్ మునీర్, షేక్ షఫీ, సయ్యద్ దస్తగిరి, పండు, జీమర్, కాలేషా, రఫి, జిలానీ, ముస్తాక్, కరిముల్లా అన్నారు. కావలిలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఖమర్ బాబు, హసన్, రహీంభాయ్ తదితరులు కావలి ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ముస్లింల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి విమర్శలు చేస్తే సహించబోమని తెలిపారు.

నిందితుడి అరెస్ట్

సోమశిల: అనంతసాగరంలోని గుంత బజార్‌కు చెందిన షేక్ సుభాన్ ఇంట్లో చోరీ జరిగిన నేపథ్యంలో బాధితుడి ఫిర్యాదు మేరకు ఖాజీలాల్, ఖదీర్ బాషా అనే ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఖదీర్‌బాషాను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

టీడీపీ వారికే మళ్లీ కండువాలు కప్పుతూ..



టీడీపీ వారికే మళ్లీ కండువాలు వేసిన ఆనం

సోమశిల: టీడీపీ ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆనం రామనారాయణరెడ్డిని ప్రకటించినప్పటి నుంచి నియోజకవర్గంలోని పలు మండలాల్లో టీడీపీకి చెందిన వారికే మళ్లీ ఆ పార్టీ కండువాలు కప్పుతూ కొత్తవారిని చేర్చుకుంటున్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నారు. అనంతసాగరం మండలం బి.అగ్రహారం గ్రామంలో గురువారం జరిగిన ఓ వివాహ కార్యక్రమానికి హాజరైన ఆనం రామనారాయణరెడ్డి టీడీపీ నాయకులకే మళ్లీ కండువాలు కప్పారు.

మహాలక్ష్మమ్మకు పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న బీద మస్తాన్‌రావు

అల్లూరు: మండలంలోని తూర్పుగోగులపల్లి గ్రామంలో వెలసిన మహాలక్ష్మమ్మ అమ్మవారిని గురువారం రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు

వ్యక్తిపై దాడి

ఆత్మకూరు: పట్టణంలోని వందూరుగుంట గిరిజనకాలనీలో పెంచలయ్య అనే వ్యక్తిపై రవి అనే యువకుడు దాడి చేసి గాయపరిచినట్లు ఎస్సై ముత్యాలరావు తెలిపారు. గురువారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఎస్సై వెల్లడించారు. గిరిజనకాలనీకి చెందిన మహిళకు ఆమె ఇంటి సమీపంలో నివసిస్తున్న పెంచలయ్యకు పరిచయం ఏర్పడింది. ఈ విషయమై ఆ మహిళ కుమారుడు రవికి, పెంచలయ్యకు వివాదం జరగడంతో రవి పెంచలయ్యపై దాడికి పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు పెంచలయ్యను చికిత్సనిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.